

Dr.G.Rajesh
CMD INB MEDIA GROUP

TRUTH | TRUST | IMPACT

# INB TIMES

VOICE OF THE PEOPLE

INB TELUGU NEWS

ప్రచురణ: , తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సంపుటి : 03 సంచిక : 128 ఎడిటర్ : జి.రాజేష్ సోమవారం 03 ఆగష్టు 2026 పేజీలు : 6 వెల రూ. 4.00

## విద్యా, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో

# ఏపీ - ఆస్ట్రేలియా మధ్య ఈ ఒప్పందాలు




అమరావతి, ఐఎన్‌బిటైమ్స్

ఆంధ్రప్రదేశ్ - ఆస్ట్రేలియాల మధ్య నాలుగు ఎంవోయూలు కుదిరాయి. ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో ఎంవోయూలను కుదుర్చుకున్నారు. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ రంగాల్లో ఈ ఒప్పందాలు చేసుకున్నారు. విద్యా, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ఏపీ - ఆస్ట్రేలియా మధ్య ఈ ఒప్పందాలు జరిగినట్లు లోకేశ్ తెలిపారు. ×× తిరుపతిలో సోలార్ తయారీ రంగంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఈ మేరకు ఎక్స్ వేదికగా లోకేశ్ పోస్టు పెట్టారు. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యా, అంతర్జాతీయ అభివృద్ధి, బహుళ సాంస్కృతిక వ్యవహారాల సహాయ మంత్రి జూలియన్ హిల్‌కి స్వాగతం పలకడం చాలా ఆనందంగా ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. గత సంవత్సరం తన ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా జరిగిన ఫలవంతమైన చర్చల ఫలితంగా, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ, సమ్మిళిత విద్య, విద్యార్థుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో నాలుగు వ్యూహాత్మక అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశామని వెల్లడించారు. ఈ ఎంవోయూల ద్వారా తమ ఉద్దేశాన్ని ఆచరణలోకి తీసుకువచ్చామని చెప్పుకొచ్చారు. ఈ అవగాహన ఒప్పంద ఆవిష్కరణ, ప్రతిభ, ఉమ్మడి శ్రేయస్సుపై నిర్మించిన బలమైన ఆంధ్రప్రదేశ్ - ఆస్ట్రేలియా భాగస్వామ్యానికి నాంది పలుకుతుందని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## మత్తు రహిత సమాజమే లక్ష్యంగా నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్



అమరావతి, **ఐఎన్‌బిటైమ్స్** : మత్తు రహిత సమాజమే లక్ష్యంగా నషా ముక్త్ యువ ఫర్ వికసిత్ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనపై దేశవ్యాప్తంగా వంద వారాల కార్యక్రమాన్ని జాతీయ ఉద్యమంగా నిర్వహించాలని ప్రధాని పిలుపు ఇచ్చారని చెప్పుకొచ్చారు. ఈ జాతీయ ఉద్యమంలో అందరం భాగమవుదామని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'డ్రగ్స్ వద్దు బ్రో' పేరుతో ఎన్నో చైతన్య కార్యక్రమాలు నిర్వహించామని ప్రస్తావించారు. ఈగల్ అనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి సమాజ భాగస్వామ్యంతో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కోసం అలుపెరుగని కృషి చేస్తున్నామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## ఏపీలో పెరగనున్న వర్షాలు




- ఆగస్టులో పలుచోట్ల సాధారణం, అంతకంటే ఎక్కువ
-వాతావరణ శాఖ వెల్లడి

## బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ

# రాష్ట్రాన్ని 'స్టార్టప్ స్టేట్'గా నిలిపాం

- రాష్ట్రంలో మా పార్టీ బలంగా ఉన్నది
- ఫిరాయింపుల్లో బీజేపీ, కాంగ్రెస్ రెండూ ఒక్కటే
- జవాబుదారీతనానికే జెన్-జీ పోరు: కేటీఆర్
- తెలంగాణను స్టార్టప్ స్టేట్‌గా నిలిపినం
- ప్రపంచస్థాయి విజయాలు సాధించినం
- కాళేశ్వరాన్ని రికార్డు సమయంలో పూర్తిచేసినం
- మరో రాష్ట్రమైతే గొప్పగా ప్రచారం చేసుకొనేది
- మేము అధికారాన్ని టాస్క్.. గేమ్‌లా భావించినం
- ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని బాధ్యతతో పనిచేసినం
- కేసీఆర్ ప్రజల ముందుకు తరచూ రాకపోయినా
- పార్టీ వ్యవహారాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నరు
- కాంగ్రెస్, బీజేపీ పెద్ద ప్రాంతీయ పార్టీలు మాత్రమే
- ఢిల్లీలో జరిగింది వాట్సాప్ అంకుల్స్, ఇన్‌స్టా కిడ్స్ యుద్ధం
- వాట్సాప్ అంకుల్స్ మొదటి రౌండ్‌లోనే ఓడింద్రు
- జెన్‌జీ ఉద్యమం బీజేపీని తీవ్రంగా కలవరపెట్టింది




హైదరాబాద్, ఆగస్టు 2**ఐఎన్‌బిటైమ్స్** : బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని స్వతంత్ర భారత చరిత్రలో అత్యంత విజయవంతమైన 'స్టార్టప్ స్టేట్'గా నిలిపామని, అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పునరుద్ఘాటించారు. ఇటీవలే ఢిల్లీలో ఓ మీడియా సంస్థ (ఇండియన్ ఎక్స్‌ప్రెస్) నిర్వహించిన ఐడియా ఎక్స్‌చేంజ్ కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొని తన అభిప్రాయాలు పంచుకున్నారు. సమకాలీన రాజకీయాలు, డీలిమిటేషన్, పార్టీ ఫిరాయింపులు, జెన్‌జీ ఉద్యమంపై స్పందించారు. బీఆర్ఎస్ పాలనలో సాధించిన అభివృద్ధిని గణాంకాలతో వివరించారు. '2014లో తెలంగాణ తలసరి ఆదాయం రూ.94 వేలు.. 2023 నాటికి అది రూ.3.27 లక్షలకు పెరిగింది. ఇది జాతీయ సగటు కంటే రెట్టింపు. దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం సాధించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది' అంటూ వివరించారు. 2014లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) సుమారు రూ.4.5 లక్షల కోట్లుగా ఉండగా, 2023 నాటికి అది రూ.15 లక్షల కోట్లకు చేరుకున్నదని తెలిపారు. తమ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పలు రంగాల్లో గణనీయంగా పురోగతి సాధించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్, బీజేపీ జాతీయ పార్టీలు కావని, అవి పెద్ద ప్రాంతీయ పార్టీలు మాత్రమేనని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో బీఆర్ఎస్

మిగతా 2లో

## మినీ మార్ట్‌ల ద్వారా రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకుంటాం:

మంత్రి నాదెండ్ల మనోహార్

- ధరల స్థిరీకరణ విషయంలో సమీక్షిస్తున్నాం..
-అందుబాటులోకి తక్కువ ధరకు బియ్యం..
-రైతులకు రూ.31,000కోట్లు చెల్లించాం..



## క్యాన్సర్‌ను అడ్డుకుంటున్న 'వయాగ్రా'!

ఇజ్రాయెల్ శాస్త్రవేత్తల పరిశోధనల్లో శాస్త్రీయ ఆధారాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 2
: పురుషుల్లో అంగస్తంభన సమస్యకు వాడే 'వయాగ్రా' (సిల్డెనాఫిల్) క్యాన్సర్ కణాల వ్యాప్తిని, కణితుల పెరుగుదలను అడ్డుకుంటున్నదని ఇజ్రాయెల్ శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. 'వీజ్‌మన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్' పరిశోధకుల అధ్యయనంలో వయాగ్రా క్యాన్సర్ వ్యాప్తిని నెమ్మదింపజేయటంలో సహాయపడుతుందని చెప్పేందుకు శాస్త్రీయ ఆధారాలు లభించాయి. అయితే క్యాన్సర్‌కు చికిత్సగా సిఫార్సు చేయడానికి మరిన్ని క్లినికల్ అధ్యయనాలు అవసరమని భావిస్తున్నారు.



# బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని 'స్టార్టప్ స్టేట్'గా నిలిపాం

బలంగా ఉన్నదని, రాష్ట్రంలో తమ పార్టీని ఎవరూ ఫినిష్ చేయలేరని తేల్చిచెప్పారు

మరో రాష్ట్రమైతే విస్తృతంగా ప్రచారమయ్యేది

తాము నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పథకమని కేటీఆర్ పేర్కొన్నారు. అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఏది అని ఇంటర్నెట్‌లో సెర్చ్ చేస్తే కాళేశ్వరమనే సమాధానం వస్తుందని చెప్పారు. సముద్ర మట్టానికి సుమారు 80 మీటర్ల ఎత్తులోని నీటిని, పలు దశల్లో 620 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోసే ప్రాజెక్టును తాము నిర్మించామని తెలిపారు. ఇలాంటి ఘనత బీజేపీ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు సాధించి ఉంటే దేశవ్యాప్తంగా మరింత ప్రచారం దక్కేదని వ్యాఖ్యానించారు. కానీ తమకు తగినంత ప్రచారం లభించలేదని తెలిపారు. భాక్రానంగల్, నర్మద వంటి ఎన్నో ప్రాజెక్ట్‌లు నిర్మించినా దశాబ్దాలు పట్టిందని, ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరాన్ని తాము కేవలం నాలుగేండ్ల వ్యవధిలోనే పూర్తిచేశామని చెప్పారు.

బిగ్ ఇన్నోవేషన్ క్యాంపస్

హైదరాబాద్‌లోని టీ హబ్ ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్‌గా ఎదిగిందని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో ఏర్పాటు చేసిన టీ హబ్ నుంచి స్కైరూట్ వంటి సంస్థలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. స్టార్టప్‌ల అభివృద్ధికి తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని వివరించారు. వరి ఉత్పత్తిలో తెలంగాణ నంబర్‌వన్‌గా ఎదిగిందని, వ్యవసాయం, పరిశ్రమలు, ఐటీ, మౌలిక సదుపాయాలు, సంక్షేమం సహా అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించిందని గుర్తుచేశారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు ఆయన సమాధానాలిచ్చారు.

ప్రశ్న : పదేండ్ల అధికారాన్ని ఎలా భావించారు?

కేటీఆర్: మేము అధికారాన్ని ఆస్వాదించలేదు. టాస్క్.. గేమ్‌లా భావించాం. ప్రజలు అప్పగించిన గొప్ప బాధ్యతగా భావించి పనిచేశామన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజం. పదేండ్ల పాటు ప్రజల కోసం అంకితభావంతో పనిచేసినం. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా మేము ప్రాతినిధ్యం వహించిన తెలంగాణ రాష్ట్రం సాధించిన అభివృద్ధిని చూసి గర్వపడుతున్నం.

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేనని కాంగ్రెస్ అంటున్నది?

కాంగ్రెస్-బీజేపీ మధ్య రహస్య అవగాహన ఉన్నది. కేంద్ర ప్రభుత్వ పథకాల కాంట్రాక్టులు, రాష్ట్ర ప్రభుత్వ పనుల్లో పరస్పర ప్రయోజనాలు పొందుతున్నరు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి బావమరిది కేంద్ర ప్రభుత్వ అమృత్ టెండర్లు దక్కించుకుంటరు. బీజేపీ ఎంపీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పనులు కైవసం చేసుకుంటరు. ఇంత జబర్దస్తీ దోస్తీ నడుస్తున్నది. ఇరు పార్టీలు కలిసి కేసీఆర్ ప్రతిపక్ష పాత్ర పోషించడం లేదన్న ఆరోపణలపై మీరేమంటరు?

తెలంగాణ రాజకీయాల్లో బాపు కేసీఆర్ మాత్రమే. రాష్ట్రంలో కేసీఆర్ ఓ వైపు ఉంటే.. మిగతా వారంతా మరో వైపు ఉన్నరు. కేసీఆర్ రాజకీయాల్లో చురుగ్గానే ఉన్నరు. ప్రజల ముందుకు తరచూ రాకపోయినా పార్టీ వ్యవహారాల ను పర్యవేక్షిస్తున్నరు. అవసరమైనప్పుడు ప్రజా సమస్యలపై స్పందిస్తున్నరు. కృష్ణా నది జలాల అంశంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా విమర్శించిండ్రు. నల్లగొండలో రెండు లక్షల మందితో భారీ సభ నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాలు మార్చుకునేలా చేసిండ్రు. ప్రజాస్వామ్యాన్ని గౌరవించే నాయకుడిగా కొత్త ప్రభుత్వానికి పనిచేసే అవకాశం ఇవ్వాలనే ఉద్దేశంతో కేసీఆర్ సంయమనంతో వ్యవహరిస్తున్నరు. మేమంతా కేసీఆర్ తయారుచేసిన సైనికులం.. ఆయన శిష్యులం. మేం మాట్లాడే ప్రతి అంశం పార్టీ సిద్ధాంతాలు, కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగానే ఉంటది.

సీజేపీ ఆందోళనపై మీ స్పందనేంది?

ఢిల్లీలో జరిగింది వాట్సాప్ అంకుల్స్.. ఇన్‌స్టా కిడ్స్ మధ్య యుద్ధం. వాట్సాప్ అంకుల్స్ మొదటి రౌండ్‌లోనే ఓడిపోయిండ్రు. యువత ఆందోళన అనేక సంకేతాలిస్తున్నది. ఇది బీజేపీని కలవరపెట్టింది. యువతకు సంఘీభావంగా మేము సైతం రంగంలోకి దిగినం. ఇండియా సరైన సమయంలో స్పందిస్తుందని కేసీఆర్ గతంలోనే చెప్పిండ్రు. నేపాల్‌లో జరిగినట్టు జెన్‌జీ ఆందోళనలు మన దగ్గర జరిగే అవకాశం ఉన్నదని నేను ముంబైలో జరిగిన సమావేశంలో చెప్పిన. ఈడీ, ఐటీ, సీబీఐలను ప్రయోగించి బీజేపీ జెన్‌జీని ఆపలేకపోయింది. అవేవీ యువతపై పనిచేయలేకపోయినయ్‌ూశీశ్రీ్ఱఱఎం

బీజేపీ తెలంగాణపై దృష్టిపెడితే ఎలా ఎదుర్కొంటారు?

వాస్తవానికి కాంగ్రెస్, బీజేపీ జాతీయ పార్టీలు కావనేది నా అభిప్రాయం..అవి కూడా పెద్దసైజు ప్రాంతీయ పార్టీలే. నేషనల్ పార్టీలతో దేశానికి ఒరిగేదేమీ ఉండదు. ప్రాంతీయపార్టీలు బలంగా ఉన్నప్పుడే దేశపురోగతి సాధ్యమనేది నా నిశ్చితాభిప్రాయం.. ఫిరాయింపు నిరోధక చట్టం విషయంలో రెండు పార్టీలదీ ద్వంద్వవైఖరే. ఈ చట్టం చేసిన కాంగ్రెస్ గతంలో అనేక పార్టీలను చీల్చింది. ఇప్పుడు బీజేపీ కూడా అదే చేస్తున్నది. తెలంగాణలో బీఆర్ఎస్ బలంగా ఉన్నది. ఇప్పటికే అనేక అంశాలపై పోరాటాలు చేస్తూ క్షేత్రస్థాయిలోకి వెళ్తున్నం. మా పార్టీ నుంచి వెళ్లిన ఒకరిద్దరు ఎమ్మెల్యేలు తిరిగివచ్చిండ్రు. తెలంగాణలో మా పార్టీని ఎవరూ ఫినిష్ చేయలేరు.

# వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?

నారాసుర పాలనలో అరాచకం పరాకాష్టకు చేరిందని ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ విమర్శించారు. దాడి చేసినవారికి రక్షణ కల్పిస్తూ.. రాజకీయ కక్షతో బాధితులపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు గారూ.. గారూ.. రాష్ట్రంలో ఇవాళ ఏం జరుగుతోంది? దాడి చేసినవారు అధికారపార్టీ వాళ్లయితే వారికి రక్షణ! దాడికి గురైనవారు వైయస్సార్‌సీపీ వాళ్లయితే వారిపైనే కేసులు ! బాధితులకు అండగా నిలబడితే ప్రజాప్రతినిధులపైనా కేసులు ! ప్రశ్నిస్తే అరెస్టులు ! నిలదీస్తే అర్ధరాత్రి తలుపులు బద్దలుకొట్టడం! ఇదేనా ప్రజాస్వామ్యం?ఇదేనా న్యాయం? ఇదేనా చట్టం? అని ప్రశ్నించారు.

ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా? ప్రజల చేత ఎన్నుకోబడిన ఒక ఎమ్మెల్యే ఇంటిపై అర్ధరాత్రి 2.45 గంటలకు భారీ పోలీసు బలగాలతో దాడి చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? అని చంద్రబాబును జగన్ సూటిగా ప్రశ్నించారు. ఇంటి తలుపులు బద్దలుకొట్టి, ఎమ్మెల్యే విరూపాక్షిని, ఆయన కుమారుడు చంద్రశేఖర్‌ను అరెస్టు చేసిన తీరు చూస్తే రాష్ట్రంలో అసలు రూల్ ఆఫ్ లా అనేది ఉందా? అని అనిపిస్తోందని అన్నారు. చిప్పగిరి మండలం నేమకల్లులో వైసీపీ నాయకుడి ఇంటిపై టీడీపీవాళ్లు దాడిచేస్తే, తన ప్రాణాలకు ప్రమాదం ఉందని, తన కుటుంబాన్ని కాపాడాలని ఆ నాయకుడు ఎమ్మెల్యే విరూపాక్షికి కాల్‌చేశాడు. ఒక కార్యకర్త ప్రాణభయంతో సహాయం కోరితే స్పందించడం ఎమ్మెల్యే చేసిన నేరమా? బాధిత కుటుంబానికి అండగా నిలబడటం తప్పా?' అని ప్రశ్నించారు. చివరకు పరామర్శించేందుకు వెళ్లిన విరూపాక్షిపైనే టీడీపీ శ్రేణులు రాళ్లతో దాడి చేశాయని తెలిపారు. ఆ దాడిలో ఆయన సోదరుడు శ్రీరాముడు గాయపడ్డారని పేర్కొన్నారు. నిజంగా చట్టం పనిచేస్తే ఎవరిని అరెస్టు చేయాలి? దాడి చేసినవారిని అరెస్టు చేయాలా? దాడికి గురైన ఎమ్మెల్యేను అరెస్టు చేయాలా అని ప్రశ్నించారు. కానీ ఈ ప్రభుత్వంలో దాడి చేసినవారికి రక్షణ లభిస్తోందని అన్నారు.. దాడికి గురైన ఎమ్మెల్యేనే నిందితుడిగా మార్చి ఆయనపైన, కార్యకర్తలపైన హత్యాయత్నం కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.

ఎమ్మెల్యే ఇంట్లోని సీసీటీవీ హార్డ్‌డిస్కులను పోలీసులు ఎందుకు తీసుకెళ్లారు అని జగన్ ప్రశ్నించారు. అర్ధరాత్రి పోలీసులు చేసిన దౌర్జన్యానికి సంబంధించిన దృశ్యాలు బయటకు వస్తాయనే భయమా? తలుపులు ఎలా బద్దలుకొట్టారో.. కుటుంబ సభ్యులను ఎలా భయపెట్టారో.. ఎమ్మెల్యేను ఎలా అరెస్టు చేశారో.. ప్రజలకు తెలియకూడదనే హార్డ్‌డిస్కులను తీసుకెళ్లారా? చంద్రబాబుగారూ.. సాక్ష్యాలను కాపాడాల్సిన పోలీసులతోనే సాక్ష్యాలను మాయం చేయించే ప్రయత్నం చేస్తున్నారా అని నిలదీశారు. శ్రీకాకుళం జిల్లాలోనూ ఇదేరకంగా అరాచకం చేస్తున్నారని జగన్ ఆరోపించారు. ఒక రోడ్డు ప్రమాదాన్ని రాజకీయ కక్షతో హత్య కేసుగా మార్చారని అన్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అరెస్టు చేశారని తెలిపారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించేందుకు నేను వెళ్లినప్పుడు సంఘీభావంగా లక్షలాదిగా ప్రజలు తరలివచ్చారని. ఆ ప్రజాస్పందనను చూసి మీ ప్రభుత్వం భయపడని అన్నారు. ఆ భయంతోనే ఒక వీడియో క్లిప్‌ను వక్రీకరించారని చెప్పారు. చింతాడ రవికుమార్‌పై తీవ్రమైన సెక్షన్లతో కేసులు పెట్టారని.. అనేకమంది నాయకులపై అక్రమ కేసులు నమోదు చేశారని తెలిపారు..

## ఏపీలో పెరగనున్న వర్షాలు

విశాఖపట్నం, నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి రెండు నెలలు రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం నెలకొన్న పరిస్థితులు ఆగస్టు నెలలో కొంతవరకు మెరుగుపడనున్నాయి. ఈనెలలో ఉత్తర, దక్షిణకోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానున్నది. ఈ మేరకు శుక్రవారం భారత వాతావరణ శాఖ విడుదలచేసిన బులెటిన్‌లో పేర్కొంది. ఆగస్టు, సెప్టెంబరు నెలలకు కలిపి వర్షపాతం, ఉష్ణోగ్రతల వివరాలు వెల్లడించింది. ఈ బులెటిన్ ప్రకారం ఉత్తర కోస్తాలో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, ఏలూరు, కాకినాడ, కోనసీమ, దక్షిణ కోస్తాలో ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమలో తిరుపతి, చిత్తూరు, కడప, నంద్యాల, అనంతపురం, కర్నూలు, శ్రీసత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లోని ఎక్కువ ప్రాంతాల్లో సాధారణం లేదా అంతకంటే ఎక్కువగా, మిగిలిన ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదవుతుంది.అదే సమయంలో విశాఖపట్నం, అనకాపల్లి, తూర్పుగోదావరి, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుంది. రుతుపవనాల సీజన్‌లో రెండో సగం అంటే ఆగస్టు, సెప్టెంబరు నెలలు కలిపి చూస్తే ఏపీలో కాకినాడ, కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, నంద్యాల, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఎక్కువ ప్రాంతాలు, శ్రీకాకుళం, విజయనగరంలో తక్కువ ప్రాంతాల్లో సాధారణం లేదా అంతకంటే ఎక్కువగా, రాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని అంచనావేసింది. నైరుతి సీజన్‌లో మొదటి రెండు నెలల్లో రాష్ట్రంలో 52 శాతం లోటు వర్షపాతం నమోదుతో తీవ్ర దుర్భిక్షం నెలకొంది.

## క్యాన్సర్‌ను అడ్డుకుంటున్న 'వయాగ్రా'!

**ఇజ్రాయెల్ శాస్త్రవేత్తల పరిశోధనల్లో శాస్త్రీయ ఆధారాలు**



న్యూఢిల్లీ, ఆగస్టు 2 : పురుషుల్లో అంగస్తంభన సమస్యకు వాడే 'వయాగ్రా' (సిల్డెనాఫిల్) క్యాన్సర్ కణాల వ్యాప్తిని, కణితుల పెరుగుదలను అడ్డుకుంటున్నదని ఇజ్రాయెల్ శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలింది. 'వీజ్‌మన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్' పరిశోధకుల అధ్యయనంలో వయాగ్రా క్యాన్సర్ వ్యాప్తిని నెమ్మదింపజేయటంలో సహాయపడుతుందని చెప్పేందుకు శాస్త్రీయ ఆధారాలు లభించాయి.అయితే క్యాన్సర్‌కు చికిత్సగా సిఫార్సు చేయడానికి మరిన్ని క్లినికల్ అధ్యయనాలు అవసరమని భావిస్తున్నారు. శరీరంలో ఒక చోట క్యాన్సర్ మొదలయ్యాక..మిగతా అవయవాలకు చేరాలంటే కొలెస్ట్రాల్ కావాలి. ఈ ప్రక్రియను అడ్డుకునేందుకు కీమోథెరపీ మందులతో పాటు వయాగ్రా వాడితే మరింత ప్రభావం కనపడిందని శాస్త్రవేత్తల బృందం తేల్చింది. 'సిల్డెనాఫిల్' తీసుకున్న వ్యక్తుల్లో ఈ ప్రయోజనం రెట్టింపు అవుతున్నదన్న విషయాన్ని గుర్తించారు.

# మినీ మార్ట్‌ల ద్వారా రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకుంటాం: మంత్రి నాదెండ్ల మనోహర్

విజయవాడ, ఆగస్టు 2: మినీ మార్ట్‌ల ద్వారా రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకుంటామని ఆంధ్రప్రదేశ్ మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యానించారు. ఇప్పటికే రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌ను చాలా వరకు అరికట్టామని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు సూచనలతో తక్కువ ధరకు బియ్యం అందజేస్తున్నామని తెలిపారు. ఇటీవల బియ్యం ధరలు కిలోకు పది రూపాయలు పెరిగాయని వెల్లడించారు. ఈరోజు (ఆదివారం) విజయవాడలో మంత్రి నాదెండ్ల పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.

తమ పౌరసరఫరల శాఖ ఆధ్వర్యంలో 50, 52 కిలోల చొప్పున పదికిలోల బియ్యాన్ని అందజేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధరల స్థిరీకరణ విషయంలో ఎప్పటికప్పుడు తాము సమీక్షిస్తున్నామని చెప్పుకొచ్చారు. నేడు ఎక్కడ చూసినా కిలో రూ.64లు బియ్యం ఉందని తెలిపారు. తమ ప్రభుత్వం రూ.50లకే ఇస్తుందని వెల్లడించారు. 150 కేంద్రాలు ఏర్పాటు చేసి ఈ బియ్యాన్ని అందజేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఏపీలో వెయ్యి మినీ మార్ట్‌లు తొలిసారిగా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఆ తర్వాత అదనంగా మరికొన్ని ప్రాంతాల్లో తక్కువ ధరలకు సరుకులు ఇస్తామని స్పష్టం చేశారు. వినియోగదారులకు ఇబ్బంది కలగకుండా దాదాపు 70 రకాల నిత్యావసర వస్తువులను అందజేస్తామని తెలిపారు. రేషన్ షాపుల ద్వారా ఈ మినీమార్ట్‌ల ఏర్పాటుతో డీలర్లకు ఆదాయం పెరుగుతుందని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.ఏపీవ్యాప్తంగా ఉన్న 150 రైతుబజార్లు, 500 రైస్‌మిల్ అవుట్‌లెట్ల ద్వారా తక్కువ ధరకు బియ్యాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. డీ-మార్ట్ తరహాలోనే నాణ్యమైన నిత్యావసర సరుకులను తక్కువ ధరలకే అందించడానికి వెయ్యి 'మీ మార్ట్'లను రేషన్ షాపుల ద్వారా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఆగస్టు 15వ తేదీ నాటికి కొన్ని జిల్లాల్లో మినీ మార్ట్‌లు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పుకొచ్చారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఏపీలో వర్షపాతం 34శాతం మేరకు తగ్గవచ్చని తెలిపారు.

రైతులు భూగర్భ జలాలపై ఆధారపడటం తగ్గించి, వర్షపాతం, కాలవల నీటి లభ్యత ఆధారంగానే వ్యవసాయ అధికారులు అందించే సూచనల మేరకు సాగు చేపట్టాలని మంత్రి సూచించారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే 94శాతం మంది రైతులకు రూ.31,000కోట్లు చెల్లించి తమ ప్రభుత్వం రికార్డు సృష్టించిందని తెలిపారు. పశ్చిమాసియా యుద్ధం, ఇంధన ధరల పెరుగుదల వల్ల బియ్యం ధరలు పెరిగాయని వెల్లడించారు.

## సొంత లాంచ్ ప్యాడ్ నిర్మించనున్న స్కైరూట్

హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన అంతరిక్ష స్టార్టప్ స్కైరూట్ ఏరోస్పేస్ సొంతంగా లాంచ్ ప్యాడ్‌ను నిర్మించనున్నట్టు ప్రకటించింది. వారి తొలి ఆర్బిటాల్ మిషన్ విక్రమ్-1 'ఆగమన్' ద్వారా బహుళ పేలోడ్స్‌ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ప్రైవేట్ రంగంలో భారత్‌లో తయారై కక్ష్యను చేరిన మొదటి రాకెట్‌గా విక్రమ్-1 రికార్డు సృష్టించింది. ప్రారంభ మిషన్ల కోసం ఇస్రో సౌకర్యాలనే ఉపయోగించుకోవాలని కంపెనీ భావిస్తున్నప్పటికీ, ఇప్పటికే స్వతంత్ర లాంచ్ పనులపై దృష్టి సారించింది. స్కైరూట్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో పవన్ చందన మాట్లాడుతూ.. "మేము ఇస్రోతో సుదీర్ఘకాలం కలిసి పనిచేశాం. మొదటి కొన్ని మిషన్లు ఇస్రో కేంద్రాల నుంచే జరుగుతాయి. అయితే మా సొంత లాంచ్ ప్యాడ్‌ను నిర్మించే ప్రణాళికలు మా వద్ద ఉన్నాయి" అని తెలిపారు. దీనికి సంబంధించిన స్థలం లేదా సమయపాలనను ఆయన వెల్లడించనప్పటికీ, రాబోయే సంవత్సరాల్లో మరిన్ని ప్రయోగాలు చేపట్టేందుకు ఇది అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని అన్నారు

సొంత లాంచ్ ప్యాడ్ ఉండడం వల్ల స్కైరూట్‌కు మరింత కార్యాచరణ స్వేచ్ఛ లభిస్తుంది. శ్రీహరికోటలోని ఇస్రోకు చెందిన సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ మౌలిక సదుపాయాలపై మాత్రమే పూర్తిగా ఆధారపడకుండా స్వతంత్రంగా లాంచ్‌లను షెడ్యూల్ చేయడానికి వీలవుతుంది.

భారత్‌లో అంతరిక్ష రంగ సంస్కరణల తర్వాత ప్రైవేట్ రంగం ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నదో ఈ నిర్ణయం తెలియజేస్తున్నది. స్కైరూట్ రాబోయే విక్రమ్ మిషన్లు, వాణిజ్య ప్రయోగాల కోసం సన్నద్ధమవుతున్న తరుణంలో ఈ ప్రత్యేక లాంచ్ కాంప్లెక్స్ అత్యంత కీలకమైన మౌలిక సదుపాయంగా మారనుంది. ఇది కంపెనీ సేవలను విస్తరించడానికి, వేగంగా అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ స్మాల్ శాటిలైట్ లాంచ్ మార్కెట్‌లో పోటీ పడటానికి ఎంతగానో సహాయపడుతుంది.

## మీ ముగ్గుర్ని తీసేస్తేనే అంతా సెట్ అయితది!..

। హైదరాబాద్, ఆగస్టు 2 మార్కెటింగ్ శాఖ అధికారుల పనితీరుపై మంత్రి తుమ్మల అసంతృప్తిగా ఉన్నారా? అధికారులు ఉన్నా లేనట్టేననే భావనలో ఉన్నారా? ఎక్కడి పనులు అక్కడే ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారా? మార్కెట్ కేంద్రాలుగా జరుగుతున్న అవినీతి, అక్రమాలపై నిలదీశారా? అవినీతి ఉద్యోగులకు అధికారులు వంత పాడటంపై మండిపడ్డారా? ఇంజినీరింగ్ విభాగంపై విరుచుకుపడ్డారా? ఇందుకు శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశం వేదికైందా? అంటే 'అవును' అనే సమాధానమే వస్తున్నది. శనివారం సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. అధికారుల పనితీరుపై లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చినట్టుగా మార్కెటింగ్ శాఖలో చర్చ జరుగుతున్నది 'ఎన్నిసార్లు చెప్పినా మారరా? పనులు చేయరా?' అంటూ ఫైర్ అయినట్టు తెలిసింది. ఒక దశలో ముగ్గురు ఉన్నతాధికారులపై నిప్పులు చెరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. 'మీ నిర్లక్ష్యం వల్లే పరిస్థితి ఇంత దారుణంగా ఉన్నది. ముందు మిమ్మల్ని తీసి అవతల పడేస్తే అంతా బాగుపడతది' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసినట్టు విశ్వసనీయ సమాచారం.

'కింది స్థాయి ఉద్యోగులతో పని చేయించడం లేదు, ఇందుకు పూర్తి బాధ్యత మీదే' అంటూ సెక్రటరీ సురేంద్రమోహన్, మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్లు లక్ష్మణుడు, రవి కుమార్‌పై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

# ఎం. టెక్. డేటా సైన్స్ లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన అగ్ని మండల రాజేశ్వరి కి ఘన సన్మానం



ఐ ఎన్ బి టైమ్స్ కూకట్పల్లి ప్రతినిధి, ఆగస్టు 2కూకట్‌పల్లి నియోజకవర్గం, కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్ డివిజన్‌కు చెందిన కుమారి అగ్నిమండల రాజరాజేశ్వరి గీతం హైదరాబాద్‌లో ఎం.టెక్ డేటా సైన్స్ విభాగంలో ఫస్ట్ ర్యాంక్ సాధించి విశిష్ట ప్రతిభ కనబరిచారు.

ఆమె ఈ ఘనవిజయం సాధించిన సందర్భంగా కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆమెను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధిస్తే సమాజానికి ఆదర్శంగా నిలుస్తారని, కుమారి అగ్నిమండల రాజరాజేశ్వరి సాధించిన ఈ విజయం వసంతనగర్ డివిజన్‌కే కాకుండా కూకట్‌పల్లి నియోజకవర్గానికే ఆదర్శమని పేర్కొన్నారు. గీతం యూనివర్సిటీ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రతిభను గుర్తించి, విశాఖపట్నం లోక్‌సభ సభ్యులు, గీతం యూనివర్సిటీ ప్రెసిడెంట్ మతుకుమిల్లి భరత్ చేతుల మీదుగా, అలాగే ప్రముఖ సినీ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి చేతుల మీదుగా గోల్డ్ మెడల్, మెమెంటో మరియు ప్రతిభా సర్టిఫికెట్ అందజేయడం జరిగింది.

ఈ విషయం తెలుసుకున్న వసంతనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి మరోసారి ఆమెను అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

అలాగే, కుమారి అగ్నిమండల రాజరాజేశ్వరి తల్లి శ్రీమతి అగ్నిమండల విజయలక్ష్మి ని కూడా ప్రత్యేకంగా అభినందించారు. స్వయంకృషితో తన ఇద్దరు పిల్లలను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దుతూ, సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్న విజయలక్ష్మి సేవలను ఈ సందర్భంగా ప్రశంసించారు.

# రాహుల్ గాంధీకి కేటీఆర్ బహిరంగ లేఖ

- రాకెట్లను పంపుతునోళ్లను అవమానిస్తరా?
- రాహుల్ మౌనం రేవంత్‌ను సమర్థించినట్టే!
- ఇంజినీర్లకు మీరిద్దరూ క్షమాపణ చెప్పాలి
- ఉద్యోగాల పేరిట యువతను దగా చేసింద్రు



హైదరాబాద్, ఆగస్టు 2 ఇంజినీరింగ్ విద్యార్థులను క్రిమినల్ వేస్ట్‌గా అభివర్ణించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆయనపై చర్యలు తీసుకోకుండా మౌనం వహిస్తున్న రాహుల్‌గాంధీ వెంటనే బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఓట్ల కోసం అరచేతిలో వైకుంఠం చూపి గద్దెనెక్కిన తర్వాత నిట్టనిలువునా యువతను మోసం చేసిన కాంగ్రెస్సే అసలు సిసలైన 'క్రిమినల్ వేస్ట్' అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విద్యార్థులపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ఆదివారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి బహిరంగలేఖ రాశారు.

అంతర్జాతీయ కంపెనీలకు ప్రాతినిధ్యం వహిస్తూ లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ అంతరిక్షంలోకి రాకెట్లను పంపిస్తూ దేశప్రతిష్టను ఇనుమడింపజేస్తున్న భారతీయ ఇంజినీర్లను అవమానిస్తూ ముఖ్యమంత్రి క్రిమినల్ వేస్ట్ అంటూ వ్యాఖ్యలు చేయడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్పందించాల్సిన నైతిక, రాజకీయ బాధ్యత రాహుల్‌గాంధీపై ఉన్నదని లేఖలో స్పష్టంచేశారు.


తెలంగాణవ్యాప్తంగా దుమారం రేగుతున్న ఈ వ్యవహారంపై రాహుల్‌గాంధీ మౌనం వహించడం..రేవంత్‌తో క్షమాపణలు చెప్పించకపోవడం దురదృష్టకరమని వాపోయారు. రాహుల్ మౌనంగా ఉండటం అంటే తెలంగాణ ముఖ్యమంత్రి వ్యాఖ్యలను సమర్థించినట్టేనని తేల్చిచెప్పారు. యువత ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడిన రేవంత్‌రెడ్డితో పాటు..ఆయనను రాష్ట్రంలోకి పంపించిన రాహుల్‌గాంధీ సైతం యువతకు క్షమాపణలు చెప్పాలని పునరుద్ఘాటించారు.

యూత్‌తో పెట్టుకుంటే పుట్టగతులుండవు

నేటి యువతరం భావి భారత నిర్మాతలు అనే విషయాన్ని రాహుల్‌గాంధీ గుర్తుంచుకోవాలని కేటీఆర్ హితవుపలికారు. యువతతో పెట్టుకుంటే పుట్టగతులుండవని హెచ్చరించారు. 'గతంలో యువతతో పెట్టుకున్న మీ నానమ్మ ఇందిరాగాంధీకి, తెలంగాణ ఉద్యమ సమయంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వానికి ఏ గతి పట్టిందో తెలుసుకోవాలి' అని సూచించారు. యూత్ తలుచుకుంటే నియంతలు, నియంతృత్వ పార్టీల మెడలు ఎలా వంచుతారో గుర్తు తెచ్చుకోవాలని చురకలంటించారు. ఇదే యువత కేసీఆర్ నాయకత్వంలో కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణను సాధించుకున్న విషయాన్ని మరోసారి జ్ఞప్తికి తెచ్చుకోవాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల ముందర ఓట్ల కోసం యువతను మభ్యపెట్టిన రాహుల్‌గాంధీకి నైతిక బాధ్యతను గుర్తుచేసేందుకే ఈ లేఖ రాస్తున్నానని స్పష్టంచేశారు.

# ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం గండేపల్లిలో ఘనంగా బోనాల మహా ఉత్సవాలు





ఐ ఎన్ బి టైమ్స్ కంచికచర్ల ఆగస్టు 2 :

కంచికచర్ల మండలం గండేపల్లి గ్రామంలో ఆదివారం గ్రామదేవత బోనాల మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచే వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు.మంగళవాయిద్యాలు, డప్పుల చప్పుళ్ల మధ్య పోతురాజుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. రంగురంగుల బోనాల ఊరేగింపు గ్రామ వీధులన్నీ కళకళలాడాయి. ఆడపడుచులు సంప్రదాయ దుస్తుల్లో నైవేద్యాలు తీసుకుని ఊరేగింపులో పాల్గొన్నారు.

కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు కలిసి వేడుకను నిర్వహించారు. గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొంది. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు,

# మాచర్లలో రోడ్డు ప్రమాదం

- గురుతు తెలియని వ్యక్తికి గాయాలు
-ఏకోనంపేట టర్నింగ్ వద్ద ఘటన కమలనెహ్రూ ఆసుపత్రికి తరలింపు.

ఐ ఎన్ బి టైమ్స్ విజయపురి సౌత్ ప్రతినిధి ఆగస్టు 02: మాచర్ల మండలం ఏకోనంపేట టర్నింగ్ వద్ద ఈరోజు మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న విజయపురిసౌత్ పోలీసులు క్షతగాత్రుడిని వెంటనే చికిత్స నిమిత్తం మాచర్ల హిల్ కాలనీలోని కమలనెహ్రూ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ వ్యక్తి వివరాలు తెలియరాలేదు. గుర్తింపు కార్డులు గానీ, మొబైల్ గానీ లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు.పోలీసుల విజ్ఞప్తి: ఈ వ్యక్తి గురించి గానీ, అతని కుటుంబ సభ్యుల గురించి గానీ ఎవరికైనా సమాచారం తెలిస్తే వెంటనే విజయపురిసౌత్ పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని పోలీసులు కోరారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# స్నేహం పేరుతో సైబర్ మోసాలు..!




వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు 2,400 సైబర్ కేసులు నమోదైనవనీ, బాధితులు 6.85 కోట్లు కోల్పోయారని అందులో రూ. 1.68 కోట్లు రికవరీ చేసినట్లు సైబర్ క్రైమ్ ఏసిపి వెంకటరమణ తెలిపారు. మ్యాట్రిమోనీ, ఫ్రెండ్ షిప్,పార్ట్ టైం జాబ్స్, కేవైసీ డిజిటల్ పేర్లతో మోసాలు పెరుగుతున్నాయని హెచ్చరించారు. ఓటీపీలు, బ్యాంక్,ఆధార్ వివరాలు ఎవరికి ఇవ్వొద్దని మోసపోతే వెంటనే 1930 కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# చంద్రబాబు తెచ్చిన ఎత్తిపోతల పథకాలే రైతాంగానికి జీవనాధారం మాజీ మంత్రి దేవినేని ఉమ



ఐ ఎన్ బి టైమ్స్ కంచికచర్ల ఆగస్టు 2:

ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన వేదాద్రి, ముక్త్యాల, చింతలపూడి ఎత్తిపోతల పథకాలే నేడు రైతాంగాన్ని ఆదుకుంటూ వ్యవసాయానికి జీవనాధారంగా నిలిచాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. కంచికచర్ల మండలం మున్నలూరు గ్రామంలో నిర్వహించిన "ఇంటింటికీ తెలుగుదేశం" కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి పాల్గొన్న ఆయన, కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా దేవినేని ఉమ మాట్లాడుతూ, రూ.4,000 వృద్ధాప్య పెన్షన్ ద్వారా పెద్దల ఆత్మగౌరవాన్ని కూటమి ప్రభుత్వం మరింత పెంచిందన్నారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా ప్రతి తల్లికి "తల్లికి వందనం" పథకాన్ని అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, 20 లక్షల ఉద్యోగాల కల్పన వంటి సూపర్ సిక్స్ హామీలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని చెప్పారు.రెండేళ్లలో ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజల ముందుకు తీసుకెళ్లి ప్రతి ఇంటికీ చేరవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు

# రెడ్కోకు అవినీతి చీడ!..

## ప్లాంట్ల సింక్రనైజేషన్‌కు 10 లక్షల లంచం

హైదరాబాద్, ఆగస్టు 2:: రాష్ట్ర విద్యుత్తు వ్యవస్థలో కీలకంగా మారిన టీజీ రెడ్కోకు అవినీతి చీడ అంటుకున్నదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కొంతమంది అక్రమార్కులు ఈ సంస్థను తమ అడ్డాగా మార్చుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. రెడ్కో డివిజనల్ ఇంజినీర్ వెంకటరమణ ఇంట్లో బుధవారం ఏసీబీ సోదాలు నిర్వహించడం కలకలం రేపింది. ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న ఆరోపణల్లో వెంకటరమణ ఏసీబీకి చిక్కడం ఇది రెండోసారి. 2019లో సైబర్ సిటీ సర్కిల్లో డీఈగా పనిచేస్తున్న కాలంలో రూ.25వేలు లంచం పుచ్చుకుంటూ ఆయన ఏసీబీకి చిక్కారు. మళ్లీ ఉద్యోగంలో చేరిన తర్వాత రెండేండ్ల క్రితం టీజీ రెడ్కోకు డిప్యుటేషన్‌పై వచ్చారు. ఈయనపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు రాగా, గురిపెట్టిన ఏసీబీ బుధవారం దాడులు చేసింది.

రైతన్నలకు చుక్కలు..టీజీ రెడ్కో అధికారులు రాష్ట్రంలో అన్నదాతలను ముప్పుతిప్పలు పెట్టినట్టు ఆరోపణలు వచ్చాయి. రైతుల నుంచి పెద్ద ఎత్తున లంచాలు వసూలు చేసినట్టు బీఆర్‌ఎస్ నేతలు పలుమార్లు విమర్శలు చేశారు. ముఖ్యంగా పీఎం కుసుమ్ ప్లాంట్ల డీపీఆర్‌ల ఆమోదానికి రూ.2లక్షలు డిమాండ్ చేసినట్టు తెలిసింది. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) కాంట్రాక్టర్లకు పనులు అప్పగించే విషయంలో, సోలార్ ప్లాంట్ల టెండర్ల ఖరారులోను కొందరు ముఠాగా ఏర్పడి చక్రం తిప్పారన్న ఆరోపణలున్నాయి.బినామీ కంపెనీలకు టెండర్లు కట్టబెట్టడం, వారి పేరిట పనులు చేశారన్న అభియోగాలున్నాయి. కుసుమ్ ప్లాంట్ల సింక్రనైజింగ్‌కు రూ.10లక్షలు డిమాండ్ చేసినట్టు సమాచారం. ఈ ప్లాంట్లకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లను బినామీ కంపెనీల నుంచి కొనుగోలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. దక్షిణ డిస్కమ్‌లో పనిచేసే డీఈతో పాటు, మరో ముగ్గురు నలుగురు డివిజనల్ ఇంజినీర్లు కలిసి ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్ల కంపెనీయే పెట్టినట్టు సమాచారం. సదరు కంపెనీ నుంచి ట్రాన్స్‌ఫార్మర్లను పీఎం కుసుమ్ రైతులకు అంటగట్టినట్టు తెలిసింది. దీనివెనుక భా రీ కుంభకోణం జరిగినట్టు సమాచారం.

వీసీ, ఎండీ బదిలీ..

రెడ్కో వీసీ, ఎండీ అనిలను కొంతకాలం క్రి తం ప్రభుత్వం అనూహ్యంగా బదిలీ చేసింది. ఇటీవలి కాలంలో రెడ్కోకు ప్రాధాన్యం పెరిగిం ది. 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ లక్ష్యంగా ప్రభుత్వ పాలసీని ప్రకటించడం, సర్కార్ స్కూళ్లు, విద్యాసంస్థల కార్యాలయాలపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు పనులు ఈ సంస్థ చేపట్టింది.



# ఓటీటీలోకి రష్మిక మందన్నా 'కాక్‌టెయిల్ 2'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే?

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ బాలీవుడ్ రొమాంటిక్ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కాక్‌టెయిల్ 2' డిజిటల్ రంగంలో సందడి చేయడానికి సిద్ధమైంది. బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని నమోదు చేసుకున్న ఈ చిత్రం, త్వరలోనే ఓటీటీ ప్రేక్షకులను అలరించనుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకుంది. దీంతో ఈ చిత్రం ఆగస్టు 14 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

ఈ చిత్రంలో టాలెంటెడ్ హీరో షాహిద్ కపూర్ సరసన రష్మిక మందన్నా మరియు కృతి సనన్ ఇద్దరు భామలు కీలక పాత్రల్లో నటించారు. ట్రెండీ లవ్ స్టోరీస్‌ను తెరకెక్కించడంలో దిట్ట అయిన హోమీ అదాజానియా ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. లవ్, సెంటిమెంట్ మరియు ట్రయాంగిల్ రిలేషన్‌షిప్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రానికి ప్రీతమ్ అందించిన సంగీతం మరియు పాటలు సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులు మరియు రష్మిక, షాహిద్ కపూర్ అభిమానులు ఈ రొమాంటిక్ డ్రామాను ఇంట్లోనే కూర్చుని నెట్‌ఫ్లిక్స్‌లో ఆస్వాదించవచ్చు.





## మూడు రోజుల్లోనే రూ.5,725 కోట్లు..

### బాక్సాఫీస్ వద్ద 'స్పైడర్ మ్యాన్' సరికొత్త చరిత్ర!

రాజూఅఁనవతీ–మీుఖఅ। హాలీవుడ్ స్టార్ హీరో టామ్ హాలాండ్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' (రాజూఅఁనవతీ–మీుఖఅ: దీత్మీఖఅఁ చీవష ఖుఎ) బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా విడుదలైన కేవలం మూడు రోజుల్లోనే ఈ చిత్రం ఊహించని విధంగా ఏకంగా రూ. 5,725 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టి ట్రేడ్ వర్గాలను విస్మయానికి గురిచేసింది. ఇందులో ఒక్క ఓవర్సీస్ మార్కెట్ల నుంచే సుమారు రూ. 2,900 కోట్లు రావడం విశేషం. ఇక భారత్‌లోనూ ఈ సినిమాకు ఊహించని స్థాయి స్పందన లభిస్తోంది. తొలి మూడు రోజుల్లోనే భారత్‌లో ఈ చిత్రం రూ. 180.20 కోట్ల నెట్, రూ. 215.48 కోట్ల గ్రాస్ కలెక్షన్లను సాధించి దూసుకుపోతోంది. తొలి రోజు గురువారం రికార్డు స్థాయి ఓపెనింగ్స్‌తో మొదలైన ఈ సినిమా ప్రయాణం, శుక్రవారం చిన్నపాటి డ్రాప్ చూసినప్పటికీ, శనివారం భారీ వసూళ్లతో అద్భుతమైన పునరుజ్జీవనం పొందింది. కేవలం శనివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 70.25 కోట్ల నెట్, రూ. 84.01 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టి సంచలనం సృష్టించింది.


ాూఁజవతీఅంవఎవత్ ఈ భారీ వసూళ్లతో బాలీవుడ్ స్టార్ హీరోలైన షారుఖ్ ఖాన్ 'పఠాన్', సల్మాన్ ఖాన్ 'టైగర్ 3' చిత్రాల తొలి మూడు రోజుల కలెక్షన్ల రికార్డులను ఈ హాలీవుడ్ చిత్రం అధిగమించింది. ఇంతకుముందు 'పఠాన్' మూడు రోజుల్లో రూ. 161 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించగా, 'టైగర్ 3' రూ. 144 కోట్ల వసూళ్లను మాత్రమే రాబట్టగలిగాయి.

# పెళ్లి పీటలెక్కనున్న పూజా హెగ్డే ..



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే ఈసారి కొత్త సినిమా, గ్లామరస్ ఫోటోషూట్ లేదా స్పెషల్ సాంగ్ వల్ల కాదు.. ఆమె పెళ్లి వార్తల కారణంగా నెట్టింట చర్చ మొదలైంది. త్వరలోనే పూజా హెగ్డే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారంటూ సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం, పూజా హెగ్డే తన కుటుంబ సభ్యులు చూసిన సంబంధానికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఇది ప్రేమ వివాహం కాకుండా పెద్దలు కుదిర్చిన పెళ్లి అని కూడా టాక్ వినిపిస్తోంది. అయితే ఆమె చేసుకోబోయే వరుడు సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తినా, లేక వ్యాపార రంగానికి చెందినవారా అనే విషయంపై మాత్రం ఇంకా స్పష్టత లేదు. ఈ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నప్పటికీ, ఇప్పటివరకు పూజా హెగ్డే లేదా ఆమె కుటుంబ సభ్యులు, అధికారిక ప్రతినిధులు ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో ఈ వార్తల్లో ఎంతవరకు నిజం ఉందనే అంశంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఇవి కేవలం ప్రచారంగానే చూడాల్సి ఉంటుంది. ఇక పూజా హెగ్డే సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే, 2014లో నాగచైతన్య సరసన వచ్చిన 'ఒక లైలా కోసం' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. అనంతరం 'ముకుంద' సినిమాలో నటించిన ఆమెకు తొలి దశలో ఆశించిన విజయాలు దక్కలేదు. కానీ అల్లు అర్జున్‌తో చేసిన 'డీజే: దువ్వాడ జగన్నాథం' సినిమా ఆమె కెరీర్‌కు టర్నింగ్ పాయింట్‌గా నిలిచింది.

# హృతిక్ రోషన్‌పై కంగనా రనౌత్ ఆగ్రహం..



బాలీవుడ్‌లో ఎప్పుడూ ఏదో ఒక వివాదంతో వార్తల్లో నిలిచే ప్రముఖ నటి, ఎంపీ కంగనా రనౌత్ మరియు స్టార్ హీరో హృతిక్ రోషన్ మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న 'సారీ హృతిక్' ట్రెండ్ నేపథ్యంలో వీరిద్దరి మధ్య వివాదం మళ్లీ రాజుకుంది. ఈ సోషల్ మీడియా ట్రెండ్‌పై హృతిక్ రోషన్ స్పందిస్తూ.. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు కథనాలను నమ్మవద్దని, వాస్తవాలు తెలిసే వరకు ఎలాంటి అభిప్రాయాలకు రావద్దని సూచించారు. అయితే హృతిక్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన కంగనా రనౌత్, తన పేరును వాడుకుని సోషల్ మీడియాలో తనను ట్రోల్ చేస్తున్న వారిని ఆపకుండా, ఇలాంటి వ్యాఖ్యలతో వివాదానికి ఆజ్యం పోయవద్దని హితవు పలికారు. సబా ఆజాద్‌తో నీవు సంతోషంగా ఉన్నావని తెలిసి ఆనందంగా ఉందని, మీరిద్దరూ మంచి జంట అని కంగనా పేర్కొన్నారు. కానీ ఇలాంటి వ్యాఖ్యలతో తనను మాటలతో ఇబ్బంది పెట్టడం మీ స్థాయికి తగదని, మీ భాగస్వామిని కూడా ఇరుకున పెట్టేలా ప్రవర్తించవద్దని కంగనా తెలిపింది.

# రామాయణంలో సీత పాత్ర వివాదం..

।సాయి పల్లవి పాత ఇంటర్వ్యూ వైరల్!

రామాయణంలో సీత పాత్రలో నటిస్తున్న సాయి పల్లవి ఎంపికపై సోషల్ మీడియాలో విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. సీత పాత్రకు సాయి పల్లవిని ఎలా తీసుకున్నారంటూ కొందరూ కామెంట్లు చేస్తుండగా.. ఈ చర్చల మధ్య సాయిపల్లవి గతంలో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూ నెట్టింట వైరల్ అవుతోంది. సాంప్రదాయ రూపురేఖల గురించి కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, ఆమె నటనకు, సహజ సౌందర్యానికి మరికొందరు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో తన చిన్ననాటి మొటిమల సమస్య, ఫెయిర్‌నెస్ క్రీమ్ యాడ్ తిరస్కరించడం గురించి సాయి పల్లవి గతంలో చెప్పిన ఆసక్తికర విషయాలు మళ్లీ చర్చనీయాంశమయ్యాయి.

సినిమాల్లోకి రాకముందు తనకు ఉన్న మొటిమలు, రోసిషియా సమస్య కారణంగా ఎంతో ఆందోళన చెందానని సాయి పల్లవి గతంలో తెలిపారు. 'ప్రేమమ్' సినిమా విడుదలకు ముందు నేను ఎన్నో ఫెయిర్‌నెస్ క్రీమ్‌లు వాడాను. ముఖంపై మొటిమల వల్ల ఎంతో మానసిక వేదన అనుభవించాను. నలుగురిలోకి వెళ్లడానికి భయపడేదాన్ని. జనం నా కళ్లను కాకుండా నా మొటిమలనే చూస్తున్నారని బాధపడేదాన్ని అని ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే 'ప్రేమమ్' చిత్రంతో ప్రేక్షకులు తనను ఉన్నట్లుగానే ఆదరించడంతో తనలో ఆత్మవిశ్వాసం పెరిగిందని ఆమె చెప్పారు.



పల్లవి ఎప్పుడూ కఠినంగా వ్యవహరిస్తుంటారు.